రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

కారును ఢీకొని లారీకింద పడి వ్యక్తి మృతి

ఘట్‌కేసర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ముందుగావెళ్తున్న వాహనాన్ని ఢీకొనగా బైక్‌నుంచి లారీకింద పడి ఓవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. సూరత్‌కు చెందిన మహేంద్ర దిలీప్‌బాయ్‌చౌహాన్(45) బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి చైతన్యపురిలో ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం చైతన్యపురి నుండి హనుమకొండకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో అంకుశాపూర్ సమీపంలోని హెచ్‌పిసిఎల్ కంపెనీవద్దకు రాగానే ముందున్న గుర్తుతెలియని కారుని ఢీకొనడటంతో తనబైక్‌నుంచి కిందపడగా, వెనుకనుండి వస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగానడపడం, లారీ తనపై పోవడంతో, తలకి తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మహేంద్ర దిలీప్‌బాయ్‌చౌహాన్ మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ షేక్ హీనా తెలిపారు.

లారీ బైక్‌ను ఢీకొట్టగా ఒకరు మృతి

-హిట్‌అండ్‌రన్ ప్రమాదం

ఘట్‌కేసర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
లారీ బైక్‌ను ఢీకొట్టగా ఓవ్యక్తి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలు ఎం.డి.ఆసిఫ్ (24), ఎం.డి.ఫుర్ఖాన్ (22), టైల్స్ పనులు ముగించుకొని బజాజ్ ప్లాటినా మోటార్ సైకిల్ (టిఎస్12ఈఎస్-7964)పై హైదరాబాద్ వైపు వెళ్తుండగా బైపాస్ రహదారి శ్రీవందన హోటల్ ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని లారీ డ్రైవర్ అధికవేగంతో, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ వారి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న ఎం.డి.ఆసిఫ్ లారీ వెనుకచక్రాల కిందపడి తలకు తీవ్రగాయాలై సంఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మోటార్ సైకిల్ నడుపుతున్న ఎం.డి.ఫుర్ఖాన్ కుడిచేయి, కుడికాలు, కుడికన్ను కిందిభాగంలో గాయాలపాలయ్యాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని పరారీలో ఉన్న గుర్తుతెలియని లారీ డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.

నేడు నషా ముక్త యువ కార్యక్రమం

-ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా యువతతో దేశవ్యాప్తంగా సంభాషణ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త:

ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృశ్యం

నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్-సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఆగస్టు 2న ఆదివారం మై భారత్ తెలంగాణవారు నిర్వహిస్తున్నారు. యువతతో దేశవ్యాప్తంగా 10వేలకుపైగా కేంద్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా సంభాషణ చేయనున్నట్లు తెలిపారు. భారతప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ-2047నాటికి మాదకద్రవ్యరహిత భారతదేశం లక్ష్యంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నషా ముక్త ఫర్ వికసిత్ భారత్-సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి తెలంగాణలో హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్‌టెక్నాలజీ, రంగారెడ్డిజిల్లాలోని సిఎంఆర్ టెక్నికల్‌క్యాంపస్, సిద్దిపేట్‌లోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అదనంగా మరో ఐదు జిల్లాల్లో జిల్లాస్థాయి కార్యక్రమాలు నిర్వహించి యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వశాఖలు, స్వచ్ఛందసంస్థల సేవకులు, సామాజిక సంస్థలు కలిసి నషా ముక్త యువ ప్రతిజ్ఞచేయనున్నారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మైభారత్ తెలంగాణ డైరక్టర్ చి.అన్వేష్ మాట్లాడుతూ నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ కేవలం ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదని, మాదకద్రవ్యరహిత భారతదేశం నిర్మాణానికి యువతను భాగస్వాములనుచేసి జాతీయ ఉద్యమంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో తెలంగాణలోని ప్రతి యువకుడు, విద్యాసంస్థ, ప్రభుత్వశాఖలు, సామాజికసంస్థలు పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేవిధంగా ప్రతిజ్ఞచేయాలని కోరారు. సమష్టి కృషి, యువశక్తి భాగస్వామ్యంతో వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనకు కలిసి ముందుకుసాగుదామని ఆయన సూచించారు.

నేడు వివిధ గ్రామాల్లో బోనాల పండుగ..

-ఉద్దెమర్రిలో జరిగిన గటంకుండతో ఆలయంలో పూజలు

గటంకుండతో అమ్మవారి ఆలయంలో పోతరాజుల విన్యాసాల దృశ్యం

శామీర్‌పేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకోవటానికి వివిధగ్రామాల్లో గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆలయాల కమిటీల వారు అన్ని ఏర్పాట్లుచేశారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు జరుపుకుంటున్నారు. శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తున్నందున ఆలయాలను అలంకరించి అమ్మవారి భక్తి పాటలతో మారుమోగిస్తున్నారు. ఆదివారం ఆలయాలకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకుని అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నారు. శామీర్‌పేట గ్రామంలో ఆదివారం బోనాల పండుగ జరుగుతుందని అన్ని ఏర్పాట్లుచేశామని శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ చైర్మన్ వంగ భూమిరెడ్డి తెలిపారు. ప్రజలు బోనాల పండుగను ఘనంగా ప్రశాంతంగా సంతోషంగా ఘనంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా శామీర్‌పేట మండలంలోని పలుగ్రామాల్లోనూ బోనాలపండుగను ప్రజలు ఆదివారం జరుపుకుంటున్నారు. ఇక మూడుచింతలపల్లి మండలంలోని వివిధగ్రామాల్లోనూ ఆదివారం బోనాలపండుగను ప్రజలు జరుపుకుంటున్నారు. దీనికి సంబంధించి ఉద్దెమర్రిగ్రామంలో గటంకుండతో ఊరేగింపుగా ఆలయాలకు గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామాల పెద్దలు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయాలను భక్తులు భక్తిశ్రద్ధలతో సందర్శించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాలను ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీనిలో మూడుచింతలపల్లి మున్సిపల్‌కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, కౌన్సిలర్లు దోసకాయల లతవెంకటేశ, శ్రీలతవెంకట్‌రెడ్డి, లతభూపాల్‌లు, పలువురు గ్రామపెద్దలు, భక్తులు పాల్గొని అమ్మవార్లకు పూజలుచేశారు. ఇక ఆదివారం అమ్మవార్లకు బోనాలు మహిళలు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకుని దర్శనం చేసుకోనున్నారు.

సమస్యలపై సబితా ఇంద్రారెడ్డిరెడ్డికి వినతి

-తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

సబితాఇంద్రరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు, నాయకులు

శంషాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
బిఆర్ఎస్ పార్టీ 118వ డివిజన్ ఆధ్వర్యంలో డిఆర్ఎఫ్‌సి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రజా సమస్యలతోపాటు డ్వాక్రాగ్రూప్ మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా విని, వాటి పరిష్కారంకోసం సంబంధితశాఖల అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 118వ డివిజన్ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ గాజుల రాహుల్, డివిజన్ కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసిమ, మహిళా అధ్యక్షురాలు పరమేశ్వరి, ఉపాధ్యక్షులు మహేష్‌యాదవ్, లీగల్ సెల్ జైకృష్ణ, యూత్ ప్రెసిడెంట్ టిల్లు, సెక్రటరీ వేణు, సీనియర్ నాయకులు యుగేందర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్, కిట్టు, చరణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

49బస్తాల నకిలీ డిఏపి ఎరువులు సీజ్

నకిలీ ఎరువుబస్తాలను సీజ్‌చేస్తున్న అధికారులు

బంట్వారం, ఆగస్టు 1, ప్రభాతవార్త:
నకిలీ ఎరువుల విక్రయాలపై మండల వ్యవసాయ అధికారి ప్రత్యేకనిఘా పెట్టింది. ఇందులో భాగంగా 49 నకిలీ ఎరువుబస్తాలను పట్టుకోవడం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బంట్వారం మండలం రొంపల్లిగ్రామంలో ఓ రైతు 49 బస్తాల నకిలీ డీఏపీ ఎరువు బస్తాలను కొనుగోలు చేసి నిల్వ ఉంచాడు. సమాచారం అందుకు మండల వ్యవసాయ అధికారి శ్రావ్య సంఘటన స్థలానికి చేరుకుని, ఎరువు బస్తాలను పరిశీలించి చూడగా, నకిలీ ఎరువుబస్తాలుగా గుర్తించింది. దీంతో సదరు రైతును ఎక్కడినుంచి కొనుగోలుచేశావని, అడుగగా, పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన పోలరాజు అనే వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు రైతు సమాధానం ఇచ్చారు. దీంతో నకిలీ ఎరువుబస్తాలను ఏఓ సీజ్‌చేశారు. నకిలీ ఎరువుబస్తాలు విక్రయించిన పోలరాజుపై కేసు నమోదు చేయాల్సిందిగా స్థానిక ఎస్ఐ విమలకు ఫిర్యాదు ఏఓ ఫిర్యాదు చేశారు. ఏఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విమల తెలిపారు.

ఓటరు జాబితా సవరణలో నాణ్యతే లక్ష్యం

-అధికారులతో ఎన్నికల సంఘం సమీక్ష

సమావేశంలో మాట్లాడుతూన్న ఎన్నికలసంఘం కార్యదర్శి నవీన్‌కుమార్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ప్రత్యేక ఓటరుజాబితా సమగ్రసవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యున్నతనాణ్యతతో పూర్తిచేయాలని భారత ఎన్నికలసంఘం కార్యదర్శి నవీన్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 10వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో లభించిన అదనపుసమయాన్ని పూర్తిగా నాణ్యతపెంపునకు వినియోగించాలని సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన ఎస్ఐఆర్ అమలుతీరును సమగ్రంగా పరిశీలించారు. అనంతరం కొంగర, బొంగులూరు, ఎల్‌బినగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు. సమావేశానికి హాజరైన భారత ఎన్నికలసంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి స్వాగతం పలికారు. ఈసందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో చేసిన పనిని అభినందించారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేకశిబిరాలు, ఫారంఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని కొనియాడారు. ప్రస్తుతం ఎన్నికలసంఘం అదనంగా ఏడురోజుల గడువు కల్పించిన నేపథ్యంలో ఇప్పటికే డిజిటలైజ్‌చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్‌లెవల్ అధికారులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫోటోలు, పత్రాల అప్‌లోడ్, వ్యక్తిగతవివరాల్లో ఎలాంటిలోపాలు లేకుండా నిర్ధారించాలని చెప్పారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మికతనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతికేంద్రాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికలసంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నచోట వాటినే పోలింగ్‌కేంద్రాలుగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టంచేశారు. మరణించిన, చిరునామామార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబసభ్యులు, స్థానికసమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని తెలిపారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని, బిఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి అందుతున్నాయని పేర్కొంటూ, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా బిఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన దరఖాస్తులు స్వీకరిస్తూ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నతీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను కూడా నాణ్యతతో పూర్తిచేసి ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్‌కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్‌కేంద్రానికి సగటున 1,056మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శేరిలింగంపల్లి, ఎల్‌బినగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి పట్టణనియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తికాగా, గ్రామీణ ప్రాంతాల్లో మంచి పురోగతి నమోదవుతోందని, పట్టణప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, అనామలీస్, డూప్లికేట్, నోమ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. ఆగస్టు 10వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, బిఎల్‌వోలు, బిఎల్‌ఏలతో కలిసి పెండింగ్‌కేసులను సంయుక్తంగా పరిశీలించి ప్రతి అర్హుడైన ఓటరువివరాలు కచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతంచేస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు సమీపంలోనే పోలింగ్‌కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్‌కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రత్యేకశిబిరాలు, ఫారంఫిల్లింగ్ మేళాల వల్ల ప్రజల నుంచి మంచిస్పందన లభిస్తోందని, ప్రతి అర్హుడైన ఓటరువివరాలు ఎన్నికలసంఘం మార్గదర్శకాల ప్రకారం నమోదు అయ్యేలా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్రసవరణ కార్యక్రమాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికలసంఘం కార్యదర్శి నవీన్‌కుమార్, అదనపు కలెక్టర్ కె.కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్‌బినగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బూత్‌లెవల్ అధికారులతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, ప్రజలస్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికలవిభాగం అధికారులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు

సరకు రవాణాకు అగ్రి ట్రాక్టర్లు - రవాణాశాఖ అభ్యంతరం

-రోడ్డు టాక్స్ ఎగవేతపై సీరియస్
-కొత్త ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్లపై డిటిఓ ఆరా

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:
వ్యవసాయ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను సరకు రవాణాకు ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకంగా ఖనిజాలను, ఇతరసరకురవాణా చేస్తున్నారు. ఇది మోటారువాహన నిబంధనలకు విరుద్ధం. వ్యవసాయంకోసమని కొనుగోలుచేసిన ట్రాక్టర్లలో చాలావరకు ఇతరపనులకు ఉపయోగిస్తున్నారని రవాణాశాఖ అధికారుల స్పెషల్‌డ్రైవ్‌లో తేలింది. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్‌కోసం వస్తున్న ట్రాక్టర్ల గురించి వారు ఆరాతీస్తున్నారు. సమగ్ర డాక్యుమెంట్లు సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని స్పష్టంచేస్తున్నారు. పకడ్బందీగా నిబంధనలు అమలుచేస్తున్న వికారాబాద్ రవాణాశాఖ అధికారులపై ఇటీవల రాజకీయ ఒత్తిళ్లు కూడా పెరిగినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం వ్యవసాయంకోసం ట్రాక్టర్ కొనుగోలుచేసిన రైతుపేరిట కచ్చితంగా భూములుండాలని అధికారులు చెబుతున్నారు. గతంలో భూములు లేకున్నా, తప్పుడు ధృవీకరణపత్రాలు సమర్పించి వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లారవాణాశాఖ అధికారి సుభాష్‌చందర్‌రెడ్డి నిబంధనలను పకడ్బందీగా అమలుచేయాలని కిందిస్థాయి అధికారులకు సూచనలిస్తున్నారు. ఇది బయటివ్యక్తులకు మింగుడుపడటంలేదు. రవాణాశాఖ లెక్కలప్రకారం ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయం పేరిట రిజిస్ట్రేషన్ అయిన ట్రాక్టర్లు 2,970 ఉన్నాయి. వాణిజ్యపరంగా రిజిస్ట్రేషన్ అయిన వాహనాలసంఖ్య 4077 ఉన్నట్లు గుర్తించారు. డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతనే డీలర్లు రైతుకు ట్రాక్టర్‌ను విక్రయించాలని అధికారులు అంటున్నారు. పలుచోట్ల ఇవేమీచూడకుండా ట్రాక్టర్లను విక్రయిస్తున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్(టిఆర్) కూడా లేకుండానే వాహనాలనురోడ్లపైకివదులుతున్నారు.
అగ్రికల్చర్ ట్రాక్టర్‌కు సంబంధిత డీలర్/షోరూమ్‌లలో ఫీజు వసూలుచేస్తారు. తాత్కాలిక నమోదు ఫీజు రూ.300, టిఆర్ సర్వీసు ఛార్జీలు రూ.200, దరఖాస్తు ఫీజు రూ.600, పోస్టల్ ఛార్జీలు రూ.35, రిజిస్ట్రేషన్ సర్వీసు ఛార్జీలు రూ.790, వాహన హైపోథికేషన్ ఉంటే రూ.1500 (హైపోథికేషన్ లేకుంటే వర్తించదు) నిర్ణయించాలి. కమర్షియల్ ట్రాక్టర్‌కు టిఆర్ రూ.500, టిఆర్ సర్వీస్ ఛార్జీలు రూ.200, దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి, రిజిస్ట్రేషన్ సర్వీసు ఛార్జీలు రూ.500, త్రైమాసిక రోడ్డు పన్ను షోరూము వద్దనే వసూలు చేస్తారు. అనంతరం రోడ్లపై తిరిగే కమర్షియల్ ట్రాక్టర్‌కు త్రైమాసిక రోడ్డు పన్ను రూ.550, కమర్షియల్ ట్రైలర్‌కు రూ.950, ట్రాక్టర్-ట్రైలర్ కలిపి ఆర్టీఏ ద్వారా త్రైమాసిక టాక్స్ రూ.950 వసూలుచేస్తారు. వ్యవసాయ అవసరాల కోసం నమోదైన ట్రాక్టర్‌ను అద్దెకు ఇవ్వరాదన్న నిబంధనలు ఉన్నాయి. సరకురవాణాకు, ఇతరత్రావాటికి ఉపయోగించరాదు. వాటికి కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలి. చాలా వాహనదారులు నకిలీ ఇన్సురెన్స్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్‌కువస్తున్నట్లు సమాచారం.

ఒరిజినల్స్‌తో రావాలి: డిటిఓ సుభాష్ చందర్‌రెడ్డి

ఏవాహనానికైనా ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి సుభాష్‌చందర్‌రెడ్డి స్పష్టంచేశారు. టిఆర్ లేకుండా వచ్చే వాహనాలకు ఎట్టిపరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ చేయబోమని చెప్పారు. అలాంటివాహనాలు తమవద్దకు వస్తే వాహన డీలర్‌పై చర్యలకూ వెనకాడేదిలేదన్నారు. వ్యవసాయ ట్రాక్టర్ రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారు కచ్చితంగా భూమికలిగి ఉండాలన్నారు. అగ్రికల్చర్ అవసరాలకు కొనుగోలుచేసిన వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో కమర్షియల్‌కు ఉపయోగించరాదని స్పష్టంచేశారు. కొత్తవాహనాలకు ఏడేళ్లవరకు ప్రతి రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ చేసుకోవాలని ఆయన వివరించారు.

పిల్లల రక్షణకర్తగా ఉపాధ్యాయుడు బాధ్యతవహించాలి

-విద్యార్థులకు నైతికవిలువలను నేర్పించాల్సిన బాధ్యత టీచర్లదే
-మేడ్చల్ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, చైర్మన్ బాలభాస్కర్‌రావు
-చైల్డ్ ప్రొటెక్షన్‌పై అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

సదస్సును ప్రారంభించిన జిల్లా సెషన్స్ జడ్జి, చైర్మన్ బాలభాస్కర్‌రావు, పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త:
పిల్లలహక్కుల పరిరక్షణ, బాలలచట్టాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించటానికి సదస్సును నిర్వహించటం అభినందనీయమని, విద్యార్థులకు సిలబస్‌తోపాటు నైతికవిలువల గురించి నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మేడ్చల్‌జిల్లా సెషన్స్ న్యాయమూర్తి చైర్మన్ బాలభాస్కర్‌రావు పేర్కొన్నారు. శనివారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో చైల్డ్ ప్రొటెక్షన్‌పై అవగాహనసదస్సు జరిగింది. ఈ సదస్సును జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, చైర్మన్ బాలభాస్కర్‌రావు, జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. జిల్లాన్యాయసేవాధికారసంస్థ(డిఎల్ఎస్ఎ), విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమితులైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఒకరోజు అవగాహనసదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా జిల్లాన్యాయమూర్తి, చైర్మన్ బాలభాస్కర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బాలల చట్టాలపై పూర్తి అవగాహన కల్పించటానికి జిల్లాన్యాయసేవాధికారసంస్థ, విద్యాశాఖవారు సంయుక్తంగా అవగాహనసదస్సును నిర్వహించటం హర్షించదగ్గ విషయమన్నారు. చట్టప్రకారం 18 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి ఒక్కరు బాలలేనని, నేటిసమాజంలో పిల్లలు ఎన్నోవిధాల వేధింపులు, సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిగురించి మాట్లాడే ధైర్యం పిల్లల్లో రావాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలతో మంచిచెడుల గురించి తప్పనిసరిగా మాట్లాడాలని ఆయన సూచించారు. పిల్లల్లో పెరుగుతున్న సెల్‌ఫోన్, డిజిటల్ మీడియా వినియోగం, డ్రగ్ అబ్యూజ్ ప్రభావంపై నిరంతరం నిఘా ఉంచుతూ వారిని సరైనమార్గంలో నడిపించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు పిల్లల రక్షణకర్తగా బాధ్యత వహించాలని ఆయన సూచించారు. పాఠశాల పిల్లలపై ఎలాంటి అసభ్యకరసంఘటనలు లేదా వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు రిపోర్ట్‌చేయాలని, పాఠశాల ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో ఘటనలు సర్దుబాటు లేదా సెటిల్‌మెంట్ చేయటానికి ప్రయత్నిస్తే సదరు ఉపాధ్యాయులు, యాజమాన్యం కూడా నేరంలో భాగస్వాములుగా మారే ప్రమాదం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ సదస్సుద్వారా కీలకచట్టాలపై శిక్షణ పోక్సో యాక్ట్, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధకచట్టం, ఉచితనిర్బంధవిద్య హక్కు చట్టంపై ఉపాధ్యాయులకు నిపుణులచేత అవగాహనకల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లల సమగ్ర వికాసానికి, సురక్షిత భవిషత్‌కు విద్య, పోలీసు, రెవెన్యూ, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ నిరుపేదకుటుంబాలు న్యాయవ్యవస్థలో న్యాయసేవలు అందుకోలేని అణగారినవర్గాలకోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉచితన్యాయసేవలు అందిస్తుందన్నారు. చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్లకు చైల్డ్‌ప్రొటెక్షన్ చట్టాలపట్ల అవగాహన ఉండటానికే ఈసదస్సును ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. అనుభవజ్ఞులైన న్యాయనిపుణులు, న్యాయమూర్తులు, అందిస్తున్న ఈకార్యక్రమాన్ని సద్వినియోగంచేసుకుని పాఠశాలల్లో మిగిలిన ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సంబంధితశాఖల సమన్వయంతో చైల్డ్‌ఫ్రెండ్లీ సొసైటీని నిర్మించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రత్నయ్య, జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, డిఇఒ రేణుకాదేవి, చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10 వరకు సర్ ప్రక్రియ గడువు పొడిగింపు

-తాండూరు నియోజకవర్గంలో 90.83 శాతం సర్ ప్రక్రియ పూర్తి
-73 పోలింగ్ స్టేషన్లలో 100 శాతం పూర్తి
-నియోజకవర్గ సర్ కన్వీనర్, మాజీ ఎంపిపి కరణం పురుషోత్తంరావు వెల్లడి

యాలాల, ఆగస్టు 1, ప్రభాతవార్త:
భారత ఎన్నికలసంఘం(ఈసిఐ) నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు శనివారం తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటివరకూ సుమారు 90.83శాతం మంది సర్ ప్రక్రియ డిజిటలైజేషన్‌లో తమ ఓటు నమోదు పూర్తిచేసుకున్నారని, నియోజకవర్గంలోని 2 లక్షల52వేల2వందల ఓటర్లకుగాను చనిపోయిన, బదిలీ, గుర్తించనివి కలుపుకోగా 2లక్షల29వేల ఓటర్ల నమోదుప్రక్రియ పూర్తయ్యిందన్నారు. దీంతోపాటు 23,133మంది ఓటర్లు నేటివరకు సర్ ప్రక్రియలో పాల్గొనలేదని కరణం వివరించారు. నియోజకవర్గంలోని 269మంది బిఎల్ఎలు తమ బూత్‌లలో ఇంకా నమోదుచేసుకోని అర్హులైన ఓటర్లనుకలిసి వారి నమోదుప్రక్రియను పూర్తిచేయాలని కరణం సూచించారు. సర్‌ప్రక్రియను వంద శాతం పూర్తిచేసేందుకు కాంగ్రెస్‌పార్టీ బిఎల్ఎలు, గ్రామ, మండలపార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, మున్సిపల్‌చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, తదితరులు కృషిచేయాలని కరణం పురుషోత్తంరావు కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న సద్గుణరెడ్డి-సత్యనారాయణ దంపతులు

నాచారం, ఆగస్టు 1 ప్రభాతవార్త: నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ఆవరణలోని శ్రీకనకదుర్గ మాత ఆలయ అభివృద్ధికి ఆసుపత్రి విశ్రాంత కార్యాలయ సూపరింటెండెంట్ జైసద్గుణరెడ్డి-సత్యనారాయణ దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని దంపతులు పేర్కొన్నారు. విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు స్వీకరించి, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాదగిరి, అధ్యక్షుడు ఓం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సలహాదారులు కోలా వాసు,పి. రవీందర్, కోశాధికారి నాగరాజు,సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సురేష్, కమిటీ సభ్యులు రమేష్, దేవాలయ నిర్మాణ శిల్పి బండారు కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ.నర్సింహ

హైదరాబాద్, ఆగస్ట్ 1, ప్రభాతవార్త: యువత రాజకీయాల్లోకి రావాలని, దేశ భవిష్యత్తును యువతే నిర్ణయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టీ.నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి, ప్రధాన కార్యదర్శి కల్లురు ధర్మేంద్ర, నేతలు నేర్లకంటి శ్రీకాంత్, బిజ్జా శ్రీనివాసులు, లింగం రవి, నానాబాల రామకృష్ణ, టి.సత్యప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో మాతేశ్వరి ఘటాల ఊరేగింపు

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 1, ప్రభాతవార్త : భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఘట ప్రతిష్ఠాపన (ఎదుర్కోళ్లు) భవ్య ఊరేగింపు జరుగనుంది. అందంగా తీర్చిదిద్దిన మాతేశ్వరి ఘటాలు శాలిబండ శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం నుండి ప్రారంభమై నాగులచింత చౌరస్తా మీదుగా ఆయా ఆలయాలకు ఎంతో అట్టహాసంగా సాగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నుండి ప్రత్యేకంగా రప్పించిన కళాకారులు, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని కళారూపాల ప్రదర్శనలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణ కానున్నాయి. ప్రత్యేక కళారూపాలు, అలంకరణలు, బ్యాండు మేళాలు, తప్పట గుళ్ళ, కేరళ బ్యాండు, దేవతా మూర్తుల వేషధారణలు, నిలువెత్తు ఆధ్యాత్మిక ప్రతిమలు హైలైట్‌గా నిలువనున్నాయి. ఇందులో వివిధ ఆలయాలు పోటీ పడనున్నాయి. లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక నుండి జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, నవీన్ యాదవ్, ఉమ్మడి చైర్మన్ ఎం.మధుసూదన్ యాదవ్ తదితరులు మాతేశ్వరి ఘటాలకు స్వాగతం పలుకనున్నారు. ఊరేగింపులో 23 ఆలయాలకు చెందిన మాతేశ్వరి ఘటాలు పాల్గొంటాయి. లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయ మాతేశ్వరి ఘటం ఊరేగింపులో ముందు నిలువగా చారిత్రక అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం ఘటం చివరన నిలుస్తుంది. చార్మినార్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రత్యేక చర్యలు

-హైదర్‌గూడ డివిజన్‌లో పర్యటించిన అధికారులు,ఇంద్రపాల్ రెడ్డి

అత్తాపూర్ ఆగస్టు 1,ప్రభాతవార్త : డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హైదర్‌గూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదర్‌గూడ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ ప్రధాన రహదారి చైతన్య విలాస్ మరియు వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్ల సమస్య పనులను అధికారులు డిఈ, ఈఈ, ఫీల్డ్ ఆఫీసర్లుతో కలిసి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఇంద్రపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో పాడైన రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల మంజూరు కోసం అధికారులు వివరాలు సేకరించారు. పలువురు కాలనీవాసులు రోడ్ల సమస్యలను అధికారులకు వివరించడంతో సూచనలను స్వీకరించారు. అనంతరం అధ్యక్షుడు ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ...డివిజన్‌లోని రోడ్ల మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని త్వరలోనే పాడైన రోడ్ల సమస్యలకు పరిష్కరం లభించనుందని అన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నిమజ్జనోత్సవంలోపు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో రోడ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ,కాలనీవాసులు పాల్గొన్నారు.

బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి : ఎమ్మెల్యే

-80 దేవాలయాలకు రూ. 27 లక్షల చెక్కులు అందజేత



అత్తాపూర్ ఆగస్టు 1,ప్రభాతవార్త : తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల పండుగను పురస్కరించుకుని, జిహెచ్ఎంసి పరిధిలోని అమ్మవారి దేవాలయాల అలంకరణ మరియు ఉత్సవాల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా శనివారం శివరాంపల్లిలోని రాందేవ్ బాబా ఆలయ ప్రాంగణంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి సంబంధించిన పలువురు ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ , ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధులతో ఆయా ఆలయాల కమిటీలు అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కోరారు. 80 దేవాలయాల కమిటీ సభ్యులకు రూ. 27 లక్షల విలువైన గ్రాంట్ చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు.

మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

సైఫాబాద్, ఆగస్ట్ 1, ప్రభాతవార్త: మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్నుఉ సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్ లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో తాడిచర్ల 1 గనిని జెన్‌కోకు కేటాయించినప్పటికీ, గనుల నిర్వహణ సామర్థ్యం లేక ఎఎంఆర్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా బొగ్గు తవ్విస్తున్నారని, ఇందుకు టన్నుకు 3,800 రూపాయలు జెన్‌కో చెల్లిస్తుండగా, సింగరేణి 3,400లకే సరఫరా చేస్తోందని తెలిపారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చటం ద్వారా వందల కోట్లను దోచుకునేందుకే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బొగ్గు వెలికితీతలో ఎంతో పరిజ్ఞానం ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు మణుగూరు డీప్‌సైడ్ బ్లాకన టెండర్లలో ఈసారి ఆసక్తి చూపలేదని, అయినప్పటికీ ఏమాత్రం పరిజ్ఞానం గాని, యంత్రాంగం కానీ లేని జెన్‌కో టెండర్‌లో పాల్గొనటం వెనుక ఇంధన శాఖలోని కొంతమంది అధికారుల హస్తం ఉందని ధ్వజమెత్తారు. ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చటం ద్వారా వందల కోట్లు దండుకునేందుకే ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో 40వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30వేలకు పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి రాకపోతే 2032 తరువాత మణుగూరు ప్రాంతంలో సింగరేణి కార్యకలాపాలు నిలిచిపోతాయని, వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సింగరేణిని నిర్వీర్యం చేయాలని కుట్రలు పన్నితే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని, మణుగూరు బొగ్గుగనిని వేలం నుంచి జెన్‌కోను తప్పించి, సింగరేణికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలను కార్మిక ఉద్యమాలతో అడ్డుకున్నామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఏఐటియూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం, వేణుమాధవ్ పాల్గొన్నారు.

వంద గ్రాముల బంగారం చోరీ.. మేనల్లుడిపై అనుమానం

జూబ్లీహిల్స్, అగస్టు 1, ప్రభాతవార్తః బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబీబ్ ఫాతిమా నగర్‌లో సుమారు 107 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ హబీబ్‌ఫాతిమానగర్‌లో నివసించే షేక్ షావలి కుటుంబం ఏప్రిల్ 16న ఓ వివాహ వేడుకకు హాజరైంది. అనంతరం ఆయన తల్లి తన బంగారు ఆభరణాలతో పాటు కోడలి ఆభరణాలను ఇంట్లోని అల్మారాలో భద్రపరిచారు. జూలై 30న ఉదయం సుమారు 11 గంటలకు అల్మారా తెరిచి చూడగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించలేదు. అయితే అల్మారా తాళం మాత్రం చెక్కుచెదరకుండా ఉండటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. చోరీకి గురైన ఆభరణాల్లో మూడు తులాల బంగారు గొలుసు, నాలుగు తులాల నెక్లెస్ సెట్, ఒక తులం గొలుసు, రెండు చిన్నవి, నాలుగు పెద్దవి కలిపి మొత్తం రెండు తులాల ఉంగరాలు, ఐదు గ్రాముల ఇతర బంగారు ఆభరణాలు, రెండు గ్రాముల చిన్న గొలుసు ఉన్నాయి. మొత్తం సుమారు 107 గ్రాముల బంగారు ఆభరణాల విలువ రూ.3.15 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తమ ఇంట్లోనే ఉన్న మేనల్లుడు పింజారి ఇర్ఫాన్ ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చని బాధితుడు పోలీసులకు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో..

బంజారాహిల్స్‌లో 4.4 కిలోల వెండి వస్తువులు చోరీ హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఓ ఇంట్లో రూ.1.50 లక్షల విలువైన 4.4 కిలోల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితురాలు పద్మనాభుని జమునారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జనవరి 2026లో ఇంటి ఇనుప అల్మారాలో రెండు సంచుల్లో భద్రపరిచిన వెండి పాత్రలు, దీపాలు, చెంచాలు తదితర వస్తువులు జూలై 29న గురుపౌర్ణమి పూజ కోసం తీసేందుకు వెళ్లగా కనిపించలేదు. ఇంట్లో పనిచేసే పనిమనుషులు కావ్య, సత్యవతిపై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జూబ్లీహిల్స్‌లో..

జూబ్లీహిల్స్‌లో నిర్మాణ స్థలం నుంచి రూ.1.03 లక్షల సామగ్రి చోరీకి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. యూసుఫ్‌గూడలోని శ్రీకృష్ణనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం నుంచి రూ.1.03 లక్షల విలువైన విద్యుత్ వైర్లు, కార్పెంటర్ యంత్రాలను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సీసీటీవీ దృశ్యాల్లో తెల్లవారుజామున ముగ్గురు సంచులతో సామగ్రిని తీసుకెళ్తున్నట్లు కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు

బ్రోచర్ విడుదల చేస్తున్న దేవాలయం కమిటి ప్రతినిధులు

చార్మినార్,ఆగస్టు 1 ప్రభాతవార్త : పాతబస్తీ మహరాజ్ గంజ్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని దేవాలయం కమిటి చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్త తెలిపారు. దూద్‌బౌలి మహరాజ్‌గంజ్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను బిజెపి ఓబిసి నేషనల్ మీడియా కో ఆర్డినేటర్ పెరక సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి చైర్మన్ ఆనంద్ గుప్త, అధ్యక్షులు కట్ట వెంకటచలం ముదిరాజ్,ప్రధాన కార్యదర్శి నరసింహ ముదిరాజ్,కోశాధికారి బుస్తా సంతోష్, ఉపాధ్యక్షులు వనభోజ శ్రీనివాస్ చారి,గుండ్ల పల్లి సుధాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు

దక్షిణ కొరియా ఉద్యోగం పేరుతో మోసం.

జూబ్లీహిల్స్, అగస్టు 1, ప్రభాతవార్తః విదేశీ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన సంఘటనపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం, దక్షిణ కొరియాలో ఉద్యోగం కల్పిస్తానని ఎంఎస్ ఓవర్సీస్ సంస్థ యజమాని ఎండి నజీర్ దక్షిణ కొరియాలో ఉద్యోగావకాశం కల్పిస్తానని ఎండీ మహబూబ్ నుంచి నమ్మించాడు. అతని మాటలు నమ్మిన మహబూబ్ రూ.8 లక్షలను నజీర్‌కు చెల్లించాడు. ఉద్యోగావకాశం కల్పించకపోవడం తోపాటు తన ఏజెంట్ల ద్వారా ఇబ్బందులకు గురిచేయడంతో బాధితుడు భారత్‌కు తిరిగి రాగా రూ.3 లక్షలు తిరిగి చెల్లించి, మిగిలిన రూ.5.80 లక్షలు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా, డబ్బులు అడిగితే బాధితుడు, అతని కుటుంబ సభ్యులను బెదిరించి దాడికి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేశ్రీగణేష్ సహకారంతో వార్డు అభివృద్ధి

3వ వార్డు మడ్‌పోర్ట్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత రాజేశ్ యాదవ్

కంటోన్మెంట్,ఆగస్టు 1 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సహాయ సహకారాలతో 3వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని సీనియర్ కాంగ్రెస్ నేత రాజేశ్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన 3వ వార్డులోని మడ్‌పోర్ట్,డబుల్‌బెడ్‌రూమ్, మజీద్ గల్లీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 3వ వార్డు ప్రాంతంలో ఉన్న శ్రీ కాళికా దేవీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ సహాయ సహకారాలతో రూ.5 లక్షల విలువ చేసే మార్బుల్ వంటి మెటీరియల్‌ను అందజేసినందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ యాదవ్,నాయకులు శంకర్,శ్రీనివాస్ గౌడ్, మురళీ, సుదర్శన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

ఉప్పల్‌లో రోడ్డు ప్రమాదం ..యువకుడు దుర్మరణం

ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక యువకుడి దుర్మరణం చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ చప్పల్‌బజార్‌కు చెందిన మద్దికుంట సాయి తేజ (23) శనివారం ఉదయం 4 గంటల సమయంలో రామంతాపూర్ చర్చ్ కాలనీ మెయిన్ రోడ్డుపై ప్రయాణిస్తుండగా, ఎదురుగా నిర్లక్ష్యంగా మరియు అజాగ్రత్తగా వచ్చి ఒక బైక్ అతని స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మద్దికుంట శివ సాయి తేజ తలకు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి, వాహనం కూడా దెబ్బతింది. మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే డాక్టర్లు మద్దికుంట శివ సాయి తేజను పరీక్షించి, అతను మరణించినట్లు ప్రకటించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాదవుల ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం : వెంకటేశ్వర్లు యాదవ్

సభలో ప్రసంగిస్తున్న పూర్వ ప్రధాన సమాచార కమిషనర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్

చిక్కడపల్లి ఆగస్టు 1,ప్రభాతవార్త : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి యాదవ్ సమాజానికి రాజకీయ, పరిపాలనా రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమని పూర్వ ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇటీవల వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా, ఇతర రాష్ట్రస్థాయి పదవులకు నియమితులైన యాదవ్ నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వరే వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ యాదవులకు ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్ల వంటి కీలక పదవుల్లో అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. యాదవుల సాంప్రదాయ పండుగ సదరును రాష్ట్ర పండుగగా గుర్తించి అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోకాపేట యాదవ్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి యాదవుల ఆత్మగౌరవ ప్రతీకగా తీర్చిదిద్దాలని కోరారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోగతికి ప్రతీ ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వంటల జంగా యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన "యాదవ్ కంఠం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి సభ్యురాలు, గొర్రెలమేకల అభివృద్ధి సహకార సమాఖ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె. సరిత తిరుపతయ్య యాదవ్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మారబోయిన రఘునాథ్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్, డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, వాస వేణుగోపాల్ యాదవ్, గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ట్రిబ్యునల్ సభ్యులు ఎం.బి. కృష్ణ యాదవ్, పుల్లారావు యాదవ్, చేవెళ్ల సంపత్ యాదవ్, దేవేందర్ యాదవ్, గుడిగె శ్రీనివాస్ యాదవ్, మారమోని శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ నగర్, అయ్యప్ప కాలనీల్లో సిసి రోడ్లకు రూ.2.02 కోట్ల నిధులు..

ఎమ్మెల్యే వివేకానంద్‌కు కాలనీవాసులు గజమాలతో, డప్పుల వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

జీడిమెట్ల, ఆగస్టు1, ప్రభాతవార్త ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం 278వ గాజులరామారం డివిజన్ పరిధిలోని పెద్దమ్మ నగర్ బస్తీకి రూ.1.12 కోట్లు, అయ్యప్ప కాలనీకి రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల నేపథ్యంలో ఆయా ప్రాంతాలను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కాలనీవాసులు గజమాలతో, డప్పుల వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడి అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. కేపీ వివేకానంద్ మాట్లాడుతూ పెద్దమ్మ నగర్ బస్తీలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్, వీధి దీపాల ఏర్పాటు వంటి పలు మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. ఇప్పుడు రూ.1.12 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. అలాగే అయ్యప్ప కాలనీలో రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మౌలిక వసతుల కల్పనకు తాను ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ కళ్యాణ్, జలమండలి డీజీఎం రవి నాయక్, మేనేజర్ రమ్య భారతి, పెద్దమ్మ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. నవీన్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు మనోహర్, కోశాధికారి ఆరిఫ్, పరశురాం, జాయింట్ సెక్రటరీ జి. శ్రీనివాస్, సంక్షేమ సంఘం సభ్యుడు గోపాల్, ప్యాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, మహిళా నాయకురాలు రాధా భాయి, స్థానిక నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూరారంలో నకిలీ క్లినిక్‌పై పోలీసుల దాడి.. బోగస్ డాక్టర్ అరెస్ట్

జీడిమెట్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త సూరారం పోలీసులతో పాటు ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ బృందం సంయుక్తంగా నిర్వహించిన దాడిలో నకిలీ క్లినిక్‌ను వెలికితీసి, బోగస్ డాక్టర్‌ను అరెస్ట్ చేశారు. ఎలాంటి వైద్య అర్హతలు, రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ లేకుండానే ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అక్రమంగా క్లినిక్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 31న విశ్వసనీయ సమాచారం మేరకు సూరారం పరిధిలోని వెంకటరామ నగర్‌లో బచ్‌పన్ స్కూల్ సమీపంలో ఉన్న "రక్షి త క్లినిక్" పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినిక్ నిర్వాహకుడు సనాది కర్ణాకర్ (35), శ్రీరామ్ నగర్ కాలనీ, సూరారం నివాసి, స్వస్థలం సిద్ధిపేట జిల్లాకు చెందిన వ్యక్తి అని గుర్తించారు. విచారణలో అతను మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నప్పటికీ, ఎలాంటి చెల్లుబాటు అయ్యే వైద్య విద్యార్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేదా వైద్య వృత్తి నిర్వహణకు అవసరమైన లైసెన్స్ లేకుండానే గత ఏడాది కాలంగా తాను డాక్టర్‌గా ప్రజలకు తప్పుడు పరిచయం చేసుకుని క్లినిక్ నిర్వహిస్తూ రోగులను పరీక్షిం చడం, మందులు ఇవ్వడం, కన్సల్టేషన్ ఫీజులు, మందుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని సూరారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతనిపై సంబంధిత చట్టాల కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సూరారం ఎస్‌హెచ్‌వో కె. బాలరాజు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, వైద్య సేవలు పొందే ముందు సంబంధిత వైద్యుడికి చెల్లుబాటు అయ్యే వైద్య అర్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్ ఉన్నాయో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో నకిలీ వైద్యులు లేదా అక్రమంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనప్రియ కాలనీ ప్రతినిధులు

కంటోన్మెంట్,ఆగస్టు 1 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 8వ వార్డు బొల్లారంలోని జనప్రియ కాలనీలో రైల్వే లైన్ పక్కన ఓపెన్ డ్రైన్ వల్ల విపరీతమైన దుర్గంధం ,దోమలు వ్యాపించడంతో పాటు రోగాల బారిన పడుతున్నారని,వరదనీరు,మురుగునీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీ ప్రతినిధులు శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డుకు చెందినకాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్, తదితరులు కాలనీ అధ్యక్షుడు డాక్టర్ మలాకర్,కోశాధికారి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్‌కు బిసి సంఘాల మద్దతు

ప్రొ.జయలక్ష్మీకి మద్దతుగా పోస్టర్ రిలీజ్ చేస్తున్న నరేందర్‌గౌడ్, వెంకీ, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 1,ప్రభాతవార్త: జేఎన్‌టీయూహెచ్ తొలి బీసీ మహిళా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. జయలక్ష్మి గారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నట్లు తాము భావిస్తున్న కుట్రలను వెంటనే విరమించుకోవాలని బీసీ సంఘాల నాయకులు తీవ్ర హెచ్చరిక చేశారు. బీసీ మహిళా అధికారిణిపై అనవసర ఆరోపణలు చేసి పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా ప్రతిఘటిస్తామని, బీసీల జోలికి వస్తే తెలంగాణలో భారీ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బీసీ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు వెంకీ, చామకూరి శ్రీధర్ గౌడ్, నాగిరి ప్రవీణ్, జి. శ్రీనివాస్, సింగం శంకర్, రాజేశ్వర్ రావు తదితరులు మాట్లాడుతూ ప్రొఫెసర్ కె. జయలక్ష్మి గారికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన

- పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఆగస్టు 1, ప్రభాతవార్తః నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 ఏళ్ల విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బాధితురాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జూలై 31 తెల్లవారుజామున బాధితురాలి తండ్రి కొద్దిసేపు బయటకు వెళ్లిన సమయంలో పక్క బెడ్‌కు అటెండర్‌గా ఉన్న నాగేశ్వరరావు ఆమెను అసభ్యంగా తాకి వేధించాడు. ఈ ఘటనతో విద్యార్థిని తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. ఆసుపత్రిలో ఇలా జరగడంతో బాలిక కంగుతిన్నది. భయంతో జరిగిన విషయాన్ని బాధితురాలి తండ్రికి తెలియజేయగా ఆయన పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 75, 79 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

-రౌడీ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ సీతయ్య కౌన్సిలింగ్

అత్తాపూర్ ఆగస్టు 1,ప్రభాతవార్త : రాబోయే వినాయక చవితి, బోనాలు పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య సమక్షంలో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ ఎ. సీతయ్య మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే సహించేది లేదని కఠినంగా హెచ్చరించారు. రౌడీ షీటర్లందరూ తమ పాత పద్ధతులను స్వస్తి చెప్పి, చట్టబద్ధమైన పనులు చేసుకుంటూ సన్మార్గంలో జీవించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టపరమైన పనులు చేసుకుంటూ తమ కుటుంబాలతో ప్రశాంతంగా జీవించాలని రాత్రి వేళల్లో అనవసరంగా తిరగడం, గుంపులుగా చేరి గొడవలకు దిగడం లేదా ప్రజలను భయాందోళనలకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు బైండ్ ఓవర్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి శనివారం నిర్వహించే పోలీస్ స్టేషన్ తనిఖీలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. పద్ధతి మార్చుకుని సన్మార్గంలో నడిచేవారికి చట్టప్రకారం అన్ని విధాలా సహకారం ఉంటుందని, మరల నేరాలకు పాల్పడితే పిడి యాక్ట్ సహా కఠినమైన చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆదివాసి ప్రాంతాల్లో ఏజెన్సీ మొబైల్ కోర్టులు నడపాలి : సునీల్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సునిల్‌కుమార్, పాయం రవివర్మ , వెంకటరమణ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 1,ప్రభాతవార్త: ఆదివాసి ప్రాంతాల్లో మొబైల్ కోర్టులు నడపాలని, కోనేరు రంగారావు కమీషన్ నివేదికలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు మరియు వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యులు, భూభారతి చట్టం రూపకర్త సునీల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజీగూడ ప్రెస్క్లబ్లో ఏజన్సీ చట్టాలు, భూ సమస్యలు, ఏజన్సీ ప్రాంతాల్లో కోర్టుల పనితీరు అనే అంశంపై ఆదివాసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాయం రవి వర్మ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు భూములు, భూ చట్టాలపై అవగాహన లేక ప్రభుత్వం నుంచి రావలసిన లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. ధరణిలో విస్తీర్ణంలో తప్పులు, పేర్ల సర్దుబాటు, సర్వేనెంబర్ల పొరపాట్ల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజన్సీ భూ సమస్యలన్నింటికీ రికార్డు పరంగా అవగాహన లేకపోవడం వల్ల సరిచేసుకోని పరిస్థితుల్లో ఆదివాసి రైతులు ఉన్నారని, భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు భూముల రికార్డులపై అవగాహన ఉన్నట్లయితే ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ ఫలాలు దక్కుతాయన్నారు. భూమి సాగుతో పాటు చేతిలో పట్టా, రికార్డులో పేరు ఉన్న రైతుకి భద్రత ఉంటుందన్నారు. ఆదివాసి ప్రాంతంలో పోడు భూములకు అనేక సమస్యలు ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ లో అనేక కేసులు పెండింగ్లో ఉండి రైతుల అనేక ఇబ్బందులు గురవుతున్నారనీ, కేసులు పరిష్కారం అవ్వకపోవటం వల్ల సామాన్యులు తమ సమస్యల పరిష్కారం కోసం అసాంఘీక శక్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తెలెత్తుతోందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం వైపుగా అడుగులు వేస్తానన్నారు. ల్యాండ్ రిఫార్మ్స్ అండ్ టెన్నిన్సీ యాక్టు చట్టం అమలు చేయాలని, ఈ చట్టం ఆదివాసులకు, ఆదివాసి రైతులకు గుండెకాయ లాంటిదని చట్టం ప్రతి ఒక్కరు తెలుసుకొని తమ భూములను రక్షించుకోవాలని సూచించారు. సమావేశంలో పాధర్ సొసైటి అధ్యక్షులు గొంది వెంకటరమణ, మెట్ల పాపయ్య, న్యాయవాదులు జేజే రాంబాబు,గణేష్, యర్రం పాపారావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధాకర్‌లాల్

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్

వికారాబాద్, ప్రభాతవార్త:
అప్పుడే పుట్టినబిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధాకర్‌లాల్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శిం చారు. ప్రపంచ తల్లిపాలవారోత్సవాలను పురస్కరించుకొని బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి తల్లి, నవజాత శిశువుకు మొదటి గంటలో వచ్చే ముర్రుపాలను తప్పక తాగించాలని అన్నారు. పిల్లలకు ఆరు నెలలవరకు తల్లిపాలుమాత్రమే సంపూర్ణ ఆహారమని, ఆరునెలల అనంతరం తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడంవలన పిల్లలలో రోగనిరోధకశక్తి పెరుగుతుందని, మెదడు, శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం బాలింతలు, గర్భవతులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వరలక్ష్మి ౣ, డాక్టర్ అమృతలక్ష్మి ౣ, వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, వైద్య అధికారులు మురళి, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తల్లిపాలవారోత్సవాలు

-మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారిణి శారద

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త:
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఈ నెల 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి శారద పేర్కొన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్రాజెక్టుల్లో, సెక్టార్లలో అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. దీనిలోభాగంగా అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. తల్లి పాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించటంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె సూచించారు.

37ఏళ్ల పోలీసు సేవలకు ముగింపు..

-షాద్‌నగర్ ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్‌కు ఘన వీడ్కోలు

పదవీవిరమణ సందర్భంగా లక్కాకుల రాజేశ్వర్ దంపతులు

షాద్‌నగర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
పోలీసు శాఖలో దాదాపు 37 సంవత్సరాలపాటు నిష్ఠ, క్రమశిక్షణతో సేవలందించిన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ లక్కాకుల రాజేశ్వర్ పదవీ విరమణ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన లక్కాకుల రాజేశ్వర్ (తండ్రి: మునియప్ప) 1989లో రంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. తొలి నియామకం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. ఉద్యోగ జీవితంలో వివిధ ప్రాంతాల్లోని మొత్తం 14 పోలీస్ స్టేషన్లలో సేవలందించిన ఆయన, తన నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, ప్రజల పట్ల స్నేహపూర్వక వైఖరితో మంచి అధికారిగా గుర్తింపు పొందారు. 2024లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన రాజేశ్వర్‌కు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ లభించింది. అక్కడ కూడా శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా రెండేళ్లుగా విధులు నిర్వహించి సహోద్యోగులు, ప్రజల ప్రశంసలు అందుకున్నారు. 61 ఏళ్ల వయస్సు పూర్తిచేసుకున్న ఆయన, 2026 జూలై 25న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది, మిత్రులు, కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికి, భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈరోజు మధ్యాహ్నం పోలీస్ శాఖ తరపున ఆయనకు ఘనంగా వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి పోలీసు ఉన్నతాధికారులు విచ్చేస్తున్నారు.

చెత్త పిచ్చిమొక్కలపై సమరం

-గడ్డి మందు కొట్టిన సర్పంచ్ కొమ్ము కృష్ణ

పరిసరాలలో గడ్డి మందు కొడుతున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ

నందిగామ, ఆగస్టు 1, ప్రభాతవార్త:
వర్షాకాలం పైగా రోగాలు ప్రభలే ఆస్కారం ఉన్నందున శనివారం సర్పంచ్ కొమ్ము కృష్ణ గడ్డి మందు కొట్టించారు. నందిగామ పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలపై గడ్డి మందు కొట్టించి, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు ఎపుగా పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నందున ముందు జాగ్రత్తచర్యగా పారిశుధ్య నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని కాలనీల ప్రజలు తమ ఇంటిముందు, వెనక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వార్డు సభ్యులు అగ్గి మమత సూరి, గంగిశెట్టి సరిత మురళి, నాయకులు కేశమోని రామచంద్రి, నరేందర్ రెడ్డి, అభిరామ్, రహమత్ అలీ, సంపత్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

-సర్పంచ్ శశికళ యాదవరెడ్డి

మోమిన్‌పేట్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
మోమిన్‌పేట్ మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో సర్పంచ్ పోలీస్ శశికళ యాదవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాబివృద్ధికి సంబందించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్యం, త్రాగునీరు, రహదారులు తదితర సమస్యలను పరిస్కరించేందుకు చర్యలుతీసుకోవాలని నిర్ణయించారు. గ్రామాభివృద్ధికి త్రి ఒక్కరు సహకరించాలని, అంరం కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సర్పంచ్ శశికళ యాదవరెడ్డి కోరారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను పర్పంచ్ దృష్టికితీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అపర్న, నాయకులు ప్రతాప్‌రెడ్డి, పంచాయతి కార్యధర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

-నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు

ఘట్‌కేసర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్ అసంపూర్తిగా ఉన్న రైల్వేవంతెనను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని వాసవీటవర్ ముందు శనివారం రైల్వేవంతెన నిర్మాణపనులు పూర్తిచేయాలని శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో బిజెపి రాష్ట్ర, జిల్లా, డివిజన్‌నాయకులు కూర్చొని నిరసన తెలిపారు. గత 13 సంవత్సరాలుగా పూర్తి కాక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రైల్వే వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ సూచనల మేరకు భారతీయ జనతా పార్టీఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ఘట్‌కేసర్ ప్రజలు దాదాపు 13 సంవత్సరాలుగా ఆర్‌ఓబి నిర్మాణం పూర్తికాక తీవ్రట్రాఫిక్‌సమస్యలు, ప్రమాదాల భయం, అత్యవసర సమయాల్లో ఆలస్యం వంటి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలకు పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ గతప్రభుత్వాలు ఈ కీలక ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ప్రజల ఇబ్బందులదష్ట్యా ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని, ఆర్‌ఓబి పూర్తయ్యేవరకు తమపోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు పెద్దపెట్టుననినాదాలుచేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కామారెడ్డి ఇంచార్జ్, జిల్లా మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రం రెడ్డి, రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, కొమ్మిడి శోభారాణి దామోదర్‌రెడ్డి, హైమారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి టి.లక్ష్మి, గోనె శ్రీనివాస్, అమరం మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు యాదగిరి, మీడియా సెల్ కన్వీనర్ చలవాది ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గొంగళ్ళ బాలేశ్, జిల్లాకార్యదర్శి-ఘట్‌కేసర్ డివిజన్‌ఇంచార్జ్ జైపాల్ రెడ్డి, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి, కార్యదర్శి పద్మారెడ్డి, ప్రగతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగం అర్జున్, మాజీ అధ్యక్షులు బండారు పవన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శివనాయక్, కార్యదర్శి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండల అధ్యక్షులు బస్వ రాజుగౌడ్, కీసర మండల అధ్యక్షులు బాలరాజుయాదవ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాగారం డివిజన్ అధ్యక్షులు నాగరాజుయాదవ్, జవహర్‌నగర్ అధ్యక్షులు కమలాకర్, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు నరేష్ పటేల్, బిజెవైఎం అత్యక్షులు సుర్వి అనిల్‌గౌడ్, నాయకులు రామతీర్థ, పోలు భాస్కర్‌గౌడ్, బి.కిషోర్‌గౌడ్, ఎర్రోళ్ల మురళీ, మహేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటానికి శ్రీకారం

-ఎస్‌డీవీపీ జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

షాద్‌నగర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ ఏర్పాటైన సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్‌డీవీపీ జేఏసీ) తన కార్యాచరణను ప్రారంభించింది. కమిటీ ఆధ్వర్యంలో శనివారం సిద్దాపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో డంపింగ్‌యార్డువల్ల కలిగేనష్టాలను వివరిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటువల్ల కేవలం ఒకగ్రామానికే కాకుండా షాద్‌నగర్ నియోజకవర్గంలోని సుమారు 50గ్రామాలు, నాలుగునియోజకవర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంత భవిష్యత్తుకు ఇది పెద్ద ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు పార్టీలకు అతీతంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జేఏసీ ఇచ్చే ప్రతి ఉద్యమ పిలుపునకు ప్రజలు పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజల తరఫున ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీవీపీ జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్యా, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, కోచైర్మన్లు వద్దే బాలయ్యా, బిత్యా నాయక్, కోకన్వీనర్లు ఈశ్వర్ నాయక్, బుద్దుల జంగయ్యా, రవీంద్రనాథ్‌తో పాటు జంగయ్యా, మహేష్, భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగులు

ఘట్‌కేసర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
పేదప్రజల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలో సాధ్యమైందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ లింగాపురం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారురాలు లింగాల భూలక్ష్మి యాదగిరి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగా మహేశ్‌గౌడ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్దిదారు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, వేముల మమతగౌడ్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, సహకార సంఘం మాజీ డైరెక్టర్లు గాయరు విశ్వనాధం, కొమిరెడ్డి ఉదయకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు వేముల రాజుగౌడ్, మాజీ వార్డుసభ్యులు గుర్జకుంట నర్సింహా, మెట్టు రమేష్, బర్ల అనిత, మాజీ కోఆప్షన్ సభ్యురాలు పైళ్ల లతరెడ్డి, నాయకులు వేముల పరమేష్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల దాహంతీర్చిన సేవాహస్తం

-గిరిజన గురుకులంలో బోర్ ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు

తాగునీటి కోసం బోరు వేస్తున్న దృశ్యం

కొత్తూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
గిరిజన గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. శనివారం కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో తాగునీటి ఇబ్బందులతో విద్యార్థులు తీవ్రంగా అవస్థలు పడుతున్న విషయాన్ని అధ్యాపక బృందం, సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, గ్రామస్థులు రవీందర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించిన రవీందర్ యాదవ్ సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో బోర్‌వేయించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, గ్రామపెద్దలు మాట్లాడుతూ.. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి, సమస్యను పరిష్కరించేందుకు తన సొంత ఖర్చులతో బోర్ ఏర్పాటు చేయించడం అభినందనీయమని అన్నారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి, సర్పంచ్ నర్సమ్మ శ్రీను, మాజీ సర్పంచులు జంగయ్య, సంతోష్ నాయక్, రమేష్, మాజీ ఎంపీటీసీ వద్దె బాలయ్య, నాయకులు మిట్టునాయక్, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, సిరాజోద్దీన్, గోపినాయక్, యాదగిరి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సతీష్ గుప్తా, మల్లేష్, హనుమంతు, డీలర్‌కుమార్, కోట్యానాయక్, మోహన్‌నాయక్, జంగయ్య, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు వెళ్లిన తపస్ నాయకులు

ధర్నాకు బయలుదేరిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

పూడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను సాధించేవరకు విశ్రమించేది లేదని ఉపాధ్యాయసంఘం(తపస్) మండల అధ్యక్షులు నవీన్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకోసం శనివారం హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కువద్ద నిర్వహించిన మహాధర్నాకు పూడూరు మండలంనుండి ఉపాధ్యాయ సంఘం(తపస్) తరపున భారీసంఖ్యలో వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ,పాధ్యాయుల, పెన్షనర్లకు సంబధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. 2023 నుండి అమలు చేయాల్సిన పిఆర్సీ ఇంతవరకు అమలుకాకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థికనష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. 2024 నుండి అందాల్సిన 6డిఎలు ఇంతవరకు రాలేదని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ రీయంబర్స్‌మెంట్, సరెండర్, లీవ్, బిల్లులు, పదవీవిరమణ ప్రయోజనాలు, ఇతర పెండింగ్ బిల్లులను ప్రభుత్వ వెంటనేచెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శాంతకుమార్, మండల గౌరవ అధ్యక్షులు సంతోష్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శులు శెనివాస్, మధు, నాయకులు ఈశ్వర్‌రావు, రామారావు, రాజు, ప్రవీణ్‌కుమార్, సరస్వతి. వెంకటమ్మ, శ్రీరాములు, లక్ష్మీప్రసాద్‌గౌడ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటికల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

-మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి

పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ఇందిరమ్మ సొంత ఇంటికల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం అడికిచెర్లలో మహబూబ్‌కు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ యశోద ఆనంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా పేదలకు శాశ్వతగృహం కల్పించడం ప్రభుత్వ ప్రధానలక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రజాసంక్షేమం కోసం వివిద సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌దేనని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్, తట్టెపల్లి సోసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, ఉపసర్పంచ్ టి.ఎల్లప్ప, కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు జోగు మహిపాల్, యండి.రుక్మొద్దిన్, గోపాల్ నాయక్, హమ్ము ఖురేషి, అంబోజి, రతన్ నాయక్, రమేష్ పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం..

-హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు

షాద్‌నగర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, నవజాత శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే అమృతంతో సమానమని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడ్ పరిధిలోని షాద్‌నగర్ "ఏ" సబ్‌సెంటర్ అవుట్‌రీచ్ ఏరియాలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వ్యాధి నిరోధక కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం అత్యంత ముఖ్యమని, పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శ్రేయస్కరమన్నారు. తల్లిపాల వల్ల శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి, విరేచనాలు, న్యూమోనియా, చెవి ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. అలాగే మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మెరుగుపడతాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రసవానంతరం గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడంతో పాటు రక్తస్రావం తగ్గుతుందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గడమే కాకుండా, తల్లి ఆరోగ్యం మెరుగుపడి కుటుంబానికి ఆర్థికంగా కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రసవం అనంతరం మొదట వచ్చే పసుపు రంగు పాలను "ముర్రుపాలు"గా పేర్కొంటూ, వీటిలో అధిక స్థాయిలో వ్యాధి నిరోధక పదార్థాలు (యాంటీబాడీలు) ఉంటాయని, అవి శిశువుకు తొలి టీకా వంటివని, తప్పనిసరిగా ఇవ్వాలని తల్లులకు సూచించారు. అదేవిధంగా తొలి ఆరు నెలల వరకు నీరు, తేనె, గ్లూకోజ్ నీరు లేదా ఇతర ఆహారం ఇవ్వకూడదని, శిశువుకు అవసరమైనప్పుడల్లా పగలు, రాత్రి తేడా లేకుండా తరచూ తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అలాగే "బాల అమృతం" ఉపయోగాలపై కూడా తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, ఏఎన్ఎం ఇస్తేరు రాణి, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పట్నం రుక్కమ్మకు పైలెట్ రోహిత్‌రెడ్డి ఘననివాళి

..పట్నం బ్రదర్స్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాతృమూర్తి కీశే.పట్నం రుక్కమ్మ మృతికి సంతాపం వ్యక్తంచేస్తు బిఆర్ఎస్ పార్టీ తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శనివారం ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి పట్నం అవినాష్‌రెడ్డిలను పరామర్శించిన పైలెట్ రోహిత్‌రెడ్డి రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు వారికి ప్రసాదించాలని ఆకాంక్షించారు. పరామర్శించినవారిలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, విజయ్ కోట్ల, మహిపాల్‌లు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ముదిరాజ్ సంఘ సభ్యుల చేయూత

కేశంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
కేశంపేట మండల పరిధిలోనిపోమల్ పల్లి గ్రామానికి చెందిన ఏర్పుల చిన్నమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతురాలి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న పోమాలపల్లి కొండారెడ్డిపల్లి ముదిరాజ్ సొసైటీ సభ్యులు మానవతా దృక్పథంతో ఆమె అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం సొసైటీ తరఫున 5000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబ ఆర్థికపరిస్థితిని గ్రహించి మా కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించిన ముదిరాజ్ సొసైటీ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం, మత్స్యకారసొసైటీ కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల అధ్యక్షుడు ఏర్పుల చిన్నలింగం, ఉపాధ్యక్షుడు భాషమోని కృష్ణయ్య ఏర్పుల రమేష్, సంఘ సభ్యులుఊరడి ఆంజనేయులు, కొల్లూరు చంద్రశేఖర్, బండారి శ్రీకాంత్, భవండ్ల లింగం, ముదిరాజ్ సొసైటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై కర్రలు, రాళ్లతో దాయాదుల దాడి

-తల, శరీరంపై తీవ్రగాయాలు, నిందితులను రిమాండ్‌కు తరలింపు

-యాలాల ఎస్.ఐ.విఠల్‌రెడ్డి

యాలాల ఆగస్టు 1, ప్రభాతవార్త:
అకారణంగా ఓ యువకునిపై కర్రల,రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో యువకుని తల,శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. యాలాల ఎస్.ఐ.విఠల్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...దాయాదులు దాడికి పాజక్కెపల్లి గ్రామానికి చెందిన తలారి గిరి,తలారి భీంలు ఇరువురు కలిసి తమకు దగ్గరి బంధువైన (దాయాదియైన) తలారి లక్ష్మణ్‌తో ఫోన్‌సంభాషణ విషయంలో శుక్రవారం గొడవ జరిగింది. ఈ గొడవ కాస్త ముదరడంతో గిరి,భీంలులు కలిసి లక్ష్మణ్‌ను మాట్లాడుదామని గ్రామ శివారులోకి తీసుకెళ్లి కర్రలు,రాళ్లతో విచక్షణారహితంగాల్పడ్డారు. ఈఘటనలో దాడిచేశారు. ఈదాడిలో లక్ష్మణ్ తలకు, కాళ్లకు, చేతులకు, శరీరభాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలై రక్తస్రవంలో పడి ఉన్న లక్ష్మణ్‌ను చికిత్సనిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. యుబాధితుని తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. లక్ష్మణ్‌పై అకారణంగా దాడికి పాల్పడిన తలారి గిరి,భీంలులపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఈగొడవకు కారణం కుటుంబంలోని ఆడపడుచును వేరేగ్రామానికి చెందిన ఓయువకుడు తరచూ వేధిస్తుండగా, అందకు బాధితుడైనలక్ష్మణ్ సదరు యువకునికి సహాయం చేస్తున్నాడనే నెపంతో దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

బాధితులను పరామర్శించిన ఆర్‌బిఎల్ సిఇఒ...
దాయాదులదాడిలో తీవ్రంగా గాయపడి తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తలారి లక్ష్మణ్‌ను ఆర్‌బిఎల్ అధినేత, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈసందర్భంగ శ్రీనివాస్‌రెడ్డి గాయపడిన బాధితునికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రిడాక్టర్లను కోరారు. దాడికిగల కారణాలపై శ్రీనివాస్‌రెడ్డి బాధితకుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళనచెందాల్సిన అవసరంలేదని, తాను అండగా ఉంటానని బాధిత కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. శ్రీనివాస్‌రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సమాజంలో ఐక్యతను పెంపొందించేవి పండుగలు: పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్ ఆగస్ట్ 1, ప్రభాతవార్త:
సమాజంలో ఐక్యతను పెంపొందించేవి పండుగలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్, ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ కర స్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూని యన్ పాఠశాలలో బోనాలు పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా విద్యార్థులు పోతరాజు వంటి వివిధ వేష ధారణలతో సందడిచేశారు. ఈసందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో ఆషాఢమాసంలో బోనాలపండుగ తరతరాలుగా జరుపుకుంటున్నామని, గ్రామ దేవతలకు బోనం నైవేద్యం సమ ర్పించే ఆచారం వెనుక శాస్త్రీయమైన ప్రయో జనాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. చరిత్ర తెలియనివారు చరిత్రను నిర్మించలేరని, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. వేడుకలలో ప్రిన్స్‌పాల్ పి.స్వర్ణలత, ఉపాధ్యాయులు మాధవి, భాస్కర్, ప్రసన్న, స్వప్న, విజయ్, మనీష్, షాలినీ మరియు విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మహదేవపురం డివిజన్‌లో సిసి రోడ్లకు శంకుస్థాపన

త్వరలో మరో రూ.50 కోట్ల అభివృద్ధి పనులు: కూన శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం డివిజన్‌లో రూ.2 కోట్ల 41 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, మహదేవపురం డివిజన్‌లోని షిరిడి హిల్స్‌కు రూ.60 లక్షలు, సాయిగ్రామ్‌కు రూ.22 లక్ష లు, బాలయ్య నగర్‌కు రూ.47.50 లక్షలు, కమలమ్మ కాలనీకి రూ.20 లక్షలు, రావి నారాయణరెడ్డి నగర్‌కు రూ.92 లక్షలతో మొత్తం రూ.2.41 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ మాజీకార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, నాయకులు సీహెచ్ బుచ్చిరెడ్డి, దుగ్యాల ప్రసాద్, షిరిడి హిల్స్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి సత్య, సాయిగ్రామ్ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR MEDCHAL-MALKAJGIRI DIST, AT: MEDCHAL.
A.C.P. NO: 842 OF 2024
Between:
KAPIL CHITS (HYD) PVT. LTD. KHYM07H-10, HABSIGUDA -2 Branch, ...DISPUTANT
AND
Mr. R PADMALATHA & OTHERS ...OPPONENTS
To,
1. Mrs. RAMIREDDY PADMALATHA, W/o. RAVINDRANATH REDDY, AGED ABOUT 46 YEARS, Occ: BUSINESS. R/o. H.NO.6-5-210, SELF FINANCE COLONY, VANASTHALIPURAM, RANGAREDDY, TELANGANA-500080.
2. Mr. KATTEKOLA ANIL KUMAR, S/o. KISHAN RAO, AGED ABOUT 46 YEARS, Occ: BUSINESS-SADWIMANI GARMENTS, NADERGUL, RANGAREDDY. R/o. H.NO.5-37/A/1, IBRAHIMPATNAM VILLAGE AND MANDAL, RANGAREDDY TELANGANA.
3. Mr. GOGGI ARUN KUMAR, S/o. MADHAVA MURTHY, AGED ABOUT 51 YEARS, Occ: BUSINESS-POOJA ITEMS SALES, VANASTHALIPURAM, RANGAREDDY, TELANGANA. R/o. H.NO.5-2-119/28, C-BLOCK, SNEHAMAYAI NAGAR, VANASTHALIPURAM, HYDERABAD, TELANGANA.
4. Ms. ARE VASANTHI REDDY, D/o. VENKAT REDDY, AGED ABOUT 27 YEARS, Occ: SOFTWARE ENGINEER, EMP. NO.124704, DEPT OF DVLXT, INFOR (INDIA) PRIVATE LIMITED, HYDERABAD, TELANGANA, R/o. H.NO.6-5-60/1, PLOT NO.68, HYPE-1, SELF FINANCE COLONY, VANASTHALIPURAM, RANGAREDDY, TELANGANA-500070.
Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of Rs. 41,871/-. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the 18-08-2026 at 1:00 PM failing which the matter will be decided exparte in accordance with law.
By order of the court
J.SRINIVAS REDDY
Advocate,
Hyderabad.

మొక్కలు నాటి వాటిని రక్షించాలి

-ఎంపిడిఒ రామకృష్ణనాయక్

మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ, సర్పంచ్

కుల్కచర్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త:
మొక్కలు విధిగా నాటి వాటిని సంరక్షించాలని ఎంపిడిఒ రామకృష్ణనాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఎంపిడిఓ రామకృష్ణనాయక్ పాల్గొని సర్పంచ్ నరసిహులుయాదవ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసందర్భంగా సర్పంచ్ నరసిహులుయాదవ్ మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరంలో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అందరి సహకారం తోనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి

-సర్పంచ్ గడ్డం వెంకటయ్య

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

కుల్కచర్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త:
అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ గడ్డం వెంకటయ్య శనివారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానికనాయకులతో కలిసి పలు అభివృద్ధి, గ్రామ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ.. ఆర్థికసంవత్సరంలో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అనంతరం తెలంగాణ జలసిరి ఫోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, మహిళాసంఘాలు, వార్డుసభ్యులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికే గ్రామసభ: సర్పంచ్

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

మోమిన్‌పేట్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామ సభలు తప్పనిసరి అని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామ పంచాయతి ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతు గ్రామసభ నిర్వహించడం ద్వారా ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులందరూ పాల్గొని గ్రామంలోని సమస్యలను ఈ సభలో తెలపడం ద్వారా ఆయా పనులనిమిత్తం తీర్మానాలు చేసి అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ అభిప్రాయాలు, వారి తీర్మానాలతో గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో జలసిరిపథకం ద్వారా నీటిని వృధా కాకుండ భూగర్భజలాలు అడుగంటకుడా ఉండేందుకు ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, పంటపొలాల్లో ఫారంపాండ్, ఊరికో ఊరకుంట నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఉపాదిహామీ పథకం కింద ఆర్థికసహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, వార్డుసభ్యులు మంజుల, మాణెమ్మ, ప్రవీణ్‌కుమార్, నర్సింలు, జీపిఒ వెంకటపతి, ఏఇఒ స్వాతి, విఓఏ లక్ష్మి, ఆశావర్కర్, ఎఫ్ఏ, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు పనులు కల్పించాలి

-సర్పంచ్‌కి వినతిపత్రం అందజేత

సర్పంచ్‌కి వినతిపత్రం అందజేసిన వార్డుసభ్యులు

కుల్కచర్ల, ఆగస్టు 1, ప్రభాతవార్త:
వార్డు సభ్యులకు పనులు కల్పించి ఆర్థికం ఎదిగేందుకు కృషిచేయలని 11వ వార్డుసభ్యుడు మోత్కురు వెంకటేష్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆంజిలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డుసభ్యుడు మోత్కురు వెంకటేష్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టం2018ప్రకారం గ్రామ పంచాయతీలో వార్డుసభ్యుల పాత్ర కీలకమన్నారు. వార్డుసభ్యులను గుర్తించి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో భాగంగా వారికి కాంట్రాక్టు పనులు అప్పజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ భాస్కర్‌గౌడ్, ఉపసర్పంచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్స్పెక్టర్ సన్మానించిన మేకగూడ నాయకులు

ఇన్స్పెక్టర్ వీరబాబును సన్మానించిన మేకగూడ నాయకులు

నందిగామ, ఆగస్టు 1, ప్రభాతవార్త:
నందిగామ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఇన్స్పెక్టర్ వీరబాబును శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మేకగూడ గ్రామస్థులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామిగౌడ్, మేకగూడ మాజీసర్పంచ్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్‌నేత సుక్యనాయక్, వార్డుసభ్యులు బండారు రాజు, మరిపల్లి నర్సింలు, రఘుపతిరెడ్డి, విగ్నేష్‌రెడ్డి, ఎండి అజీమ్, హనీఫ్, యాదయ్య, రమేష్, గ్రామస్థులు తదితరులున్నారు.

ప్రజాసమస్యలపై కమిషనర్‌కు వినతుల వెల్లువ

మున్సిపల్ కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
మేడ్చల్‌పట్టణంలోని అంబేద్కర్‌భవన్ ప్రాంగణంలో వన్‌వార్డ్ ఎవ్రీడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన విచ్చేసి కార్పొరేషన్‌లోని వివిధశాఖల అధికారులతో కలిసి మేడ్చల్ వార్డును సందర్శించి పౌరసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో స్థానికప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని పట్టణంలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని వాటిపరిష్కారానికి చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈసమావేశంలో మేడ్చల్‌కు సంబంధించిన అనేక కీలకసమస్యలను ఒక్కొక్కటిగా వివరించారు.

మేడ్చల్‌లో తాగునీటిసమస్య రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోందని, వారానికి ఒక్కసారి మాత్రమే నీటిసరఫరా జరుగుతోందని, అదీ నిర్ణీత సమయాలు లేకుండా ఇష్టానుసారంగా విడుదల చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్రమబద్ధమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షాకాలంలో పారిశుధ్యపరిస్థితి పూర్తిగా దెబ్బతింటోందని, కాలనీల్లో చెత్తపేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండడం, దుర్వాసన వ్యాపించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యేపరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. చెత్తను ప్రతిరోజూ తొలగించేలా ప్రత్యేకచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. మేడ్చల్ బస్‌డిపోలో చెత్త, మురికి పేరుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పారిశుధ్యచర్యలు చేపట్టాలని వినతి చేశారు.

మేడ్చల్ జాతీయరహదారి పూర్తిగా దెబ్బతిని అనేకచోట్ల భారీగుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే రహదారికి మరమ్మతులుచేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. మరోవైపు కొత్తగా నిర్మించిన రోడ్లను డ్రైనేజీపనులపేరుతో మళ్లీతవ్వడంవల్ల ప్రభుత్వ నిధులు వృథాఅవుతున్నాయని, పనులమధ్య సమన్వయం లేకపోవడంవల్ల ప్రజలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హౌసింగ్‌బోర్డు ప్రధానరహదారిని సిసి రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. మేడ్చల్ తుమ్మచెరువులోపూడిక, మురుగును తొలగించకపోవడంతో వర్షపునీరు భూమిలోకి ఇంకడం లేదని, దీంతో భూగర్భజలాలమట్టం తగ్గిపోతోందని తెలిపారు. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పూడికతొలగించాలని, పెద్దచెరువును ప్రజలకు ఉపయోగపడేలాగా తీర్చిదిద్దాలని సూచించారు.

బోనాలపండుగ సందర్భంగా ఆలయాలకువెళ్లే ప్రధాన రహదారులను తవ్వి అలాగే వదిలేయడంతో మహిళలు, వృద్ధులు, భక్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పండుగలకుముందే అన్నిరహదారుల మరమ్మతులు పూర్తిచేయాలని కోరారు.

పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్‌సమస్య పెరుగుతోందని, దీనికి శాశ్వతపరిష్కారంగా ముకుంద థియేటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రహదారిని వెడల్పుచేసి ప్రత్యామ్నాయమార్గంగా అభివృద్ధిచేస్తే ట్రాఫిక్‌రద్దీ గణనీయంగా తగ్గుతుందని సూచించారు. పట్టణంలో కనీసం రెండు పార్కులను అభివృద్ధిచేయాలని, సిటిజన్ చార్టర్‌ను అమలుచేసి ఏ శాఖ ఉద్యోగి ఏసేవకు బాధ్యుడో ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. మాజీచైర్మన్ దీపికనరసింహారెడ్డి, బిజెపి మున్సిపల్‌అధ్యక్షురాలు జల్లి శైలజాహరినాథ్, టిఆర్ఎస్ మాజీఅధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, కాంగ్రెస్‌అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు, మల్లేష్‌గౌడ్, మాజీవైస్‌చైర్మన్ రమేష్, వంశీధర్‌రెడ్డి, చెరువు కొమ్ము శ్రీనివాస్, మణికంఠగౌడ్ తదితరులు సైబరాబాద్ కమిషనర్‌తో మాట్లాడి మేడ్చల్‌లోని వివిధ సమస్యలను వివరించి, వాటిపరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. సమస్యలను పరిశీలించి అవసరమైనచర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్లు మహేష్, గణేష్, నాయకులు రామన్నగారి రాఘవేందర్‌గౌడ్, లవంగు శ్రీకాంత్, మైసరి రాజు, నరసింహారెడ్డి, విష్ణుచారి, ప్రతాప్, నవీన్‌రెడ్డి శ్రావణ్, రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సింగరేణి కార్మికుల సమస్యలను కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి పరిష్కారించాలి

-బిజెపి జిల్లా రూరల్ అధ్యక్షుడికి వినతి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి పరిష్కరించాలని రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. పోచారం డివిజన్ చౌదరిగూడలోని సింగరేణి రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సింగరేణి విశ్రాంత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్రమంత్రి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షుడిని కోరారు. వెంకటాద్రి టౌన్‌షిప్‌కు బిజెపి పార్టీ అంతర్గత సమావేశానికి విచ్చేసిన జిల్లా అధ్యక్షుడిని సింగరేణి రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆళవందార్ వేణుమాధవ్ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు కోల్‌మైన్స్ పెన్షన్‌స్కీమ్ 1998 సవరించి కనీస నెలవారి పెన్షన్‌ను పదివేలకు పెంచాలని, పెన్షన్ స్కీమ్‌లో మార్పుచేసి పెన్షనర్లు అందరికీ డీఏ అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పోస్ట్ మెడికేర్ స్కీం మెడికల్ కార్డు పరిమితి 25లక్షలకు పెంచాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు కంచె బీరయ్య, ఎ.ప్రభాకర్, ఎస్.లక్ష్మీనారాయణ. ఎం.రాజనర్సులున్నారు.

పెన్‌డౌన్‌కు ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధం లేదు

-టేకుల శ్రీనివాస్‌ముదిరాజ్

కేశంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రకటించిన పెన్‌డౌన్ కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని ఉపాధిహామీపథకం నిర్వహణ రాష్ట్ర నాయకులు టేకుల శ్రీనివాస్‌ముదిరాజ్ స్పష్టంచేశారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యమైన విషయాలను వెల్లడించారు. విధులపై స్పష్టత పెన్‌డౌన్ కార్యక్రమానికి సంబంధించిన బాధ్యతలు లేదా నిర్వహణ ఫీల్డ్ అసిస్టెంట్ల పరిధిలోకి రావు అని అపోహలు నమ్మవద్దు ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమం విషయంలో ఎటువంటి అయోమయానికి గురికావద్దని, ప్రచారంలో ఉన్న అపోహలను నమ్మవద్దని విజ్ఞప్తిచేశారు. సిబ్బందికి మద్దతు ఉపాధిహామీ సిబ్బంది తమపరిధిలోని సాధారణ విధులను నిరభ్యంతరంగా కొనసాగించాలని రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిర్ణయాలను ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయకుండా చిన్న, సన్నకారు రైతులకు అందించాలని సూచించారు. ఫామ్ పండ్లు ఫిష్ ఫండ్స్, ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, జలసిరి, లాంటి అనేక ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆత్మవిశ్వాసం అవసరం: ఎంఈవో

దుద్యాల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ప్రత్యేక అవసరాలు (సిడబ్ల్యూఎస్ఎన్) గల పిల్లలు ఆత్మన్యూనత భావానికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని దుద్యాల్ మండల విద్యాధికారి శంకర్ అన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దుద్యాల్ మండలంలో మొత్తం 127మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రతి ప్రభుత్వపాఠశాలలో సిడబ్ల్యూఎస్ఎన్ టాయిలెట్లు ఏర్పాటుచేసేందుకు చర్యలుతీసుకుంటామని చెప్పారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లప్ప, ఐఈడీ ఉపాధ్యాయులు రామేశ్వరి, మాధవి, ఐఆర్‌పీ రామ్ శ్రీనివాస్‌బాబు ప్రత్యేక అవసరాల పిల్లలకు అందుతున్న ప్రభుత్వ సౌకర్యాలు, విద్యాహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

-హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నా

ధర్నాలో పాల్గొన్న నాయకులు ప్రజలు

షాద్‌నగర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
తెలంగాణప్రాంత ఉపాధ్యాయసంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో బీజేపీ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం తెలిపారు. టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాధర్నాలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, కొమురయ్య, అంజిరెడ్డి, బీజేపీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు, టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి పెంటయ్య, సంఘటనాకార్యదర్శి హనుమంతరావు, ఏబీఆర్ఎస్ఎం నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది ఉపాధ్యాయులు హాజరై తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో విభేదించిన ఏప్రభుత్వమూ నిలబడలేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వెంటనే అమలుచేయాలని డిమాండ్‌చేశారు. బదిలీలు, పదోన్నతులు, ఖాళీపోస్టులభర్తీ, ఇతర పెండింగ్‌సమస్యలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. జాతీయ విద్యా విధానం-2020ను తెలంగాణలో అమలు చేయాలని సూచించిన ఆయన, డాక్టర్ కస్తూరి రంగరాజన్ నేతృత్వంలో రూపొందిన విద్యా విధానాన్ని సమగ్రంగా అమలుచేస్తే రాష్ట్ర విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి స్పష్టంచేశారు.

యాచారం ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా ఆంజనేయులు, రవీందర్

యాచారం, ఆగస్టు 1, ప్రభాతవార్త:
యాచారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శి గా పంబాల ఆంజనేయులు ఆలంపల్లి రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో వివిధ ప్రింట్ మీడియా విలేకర్ల సమావేశం సీనియర్ జర్నలిస్టు మకపల్లి శ్రీనివాస్ నమస్తే తెలంగాణ జర్నలిస్టు మడ్డి యాదగిరి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మకపల్లి శ్రీనివాస్, అధ్యక్షులుగా పంబాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గా ఆలంపల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎట్టి లక్ష్మణ్, గుండె రాఘవేందర్, కోశాధికారిగా మడ్డి యాదగిరి, ప్రచారకార్యదర్శిగా నరేందర్‌రెడ్డి, బుగ్గ రాములు, సహాయకార్యదర్శిగా రామచంద్, నరేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో విశ్వాసంతో బాధ్యత అప్పగించిన జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషిచేస్తూ సమన్వయంతో సమష్టిగా పనిచేస్తునన్నారు. జర్నలిస్టుల విధులు బాధ్యతలకు కట్టుబడి ఉంటూ కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో పునరుద్ధరణకు పానాది రోడ్డు

-హర్షం వ్యక్తంచేసిన ఆయా గ్రామాల రైతులు, ప్రజలు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
పెద్దేముల్ మండలపరిధిలోని మంబాపూర్, చైతన్యనగర్ నుంచి కొండాపూర్ వరకుగల పొలాలకు వెళ్ళేందుకు దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న రెగొండి శివారు పానాది(ఫార్మేషన్) రోడ్డును కొందరు వ్యక్తులు అక్రమంగా మూసివేయడంతో ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితరైతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం రైతులవాదనలను పరిశీలించిన న్యాయస్థానం పానాది రోడ్డును యథాతథంగా పునరుద్ధరించి ప్రజల వినియోగానికి అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలుజారీచేశారు. కోర్టు ఉత్తర్వులమేరకు రెవిన్యు అధికారులు, స్థానిక అధికారులు చర్యలుచేపట్టి పానాదిరోడ్డును పునరుద్ధరించాలని శనివారం తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్‌కు, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్‌కు కోర్టు ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సావిత్రి ప్రకాశం, దాస్కెపల్లి అంజిలయ్య, మాదాసు నర్సిములు, మాదాసు విష్ణు మాట్లాడుతూ పానాదిరోడ్డు పునరుద్ధరణతో సాగుభూములకు రాకపోకలు సులభతరం అవుతాయని హర్షం వ్యక్తంచేశారు. ఇలాంటి ప్రజా మార్గాలపై ఎవరూ అక్రమంగా ఆక్రమణలు చేయకుండా అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఆర్డర్ కాపీలను అందజేసినవారిలో కోటపల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మాజీసర్పంచ్ అంజిలయ్య, మాజీ ఉప సర్పంచ్ బిచ్చయ్య, శ్రీనివాస్, హెచ్.సుందర్, వార్డుమెంబర్ సిరగల్ల రత్నం, ఎంగురు బాలప్ప, మాదాసు భీంలు, మాదాసు దస్థప్పలున్నారు.

గడువులోపు కెవైసి పూర్తిచేసుకోండి

-లేమామిడిగ్రామ ప్రజలకు సర్పంచ్ సులోచనశ్రీను విజ్ఞప్తి

కేశంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు గ్రామప్రజలందరూ కెవైసి బయోమెట్రిక్ నమోదు ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని లేమామిడిగ్రామ సర్పంచ్ సులోచనశ్రీను సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు నిరంతరంగా అందుకోవాలంటే బయోమెట్రిక్ కెవైసి నవీకరణ అవసరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంబంధిత కేంద్రాలను సందర్శించి గడువులోగా కెవైసి పూర్తిచేసుకోవాలని, చివరినిమిషంవరకు వేచి ఉండకుండా ముందుగానే ప్రక్రియను పూర్తిచేయాలని గ్రామప్రజలకు సర్పంచ్ సులోచనశ్రీను విజ్ఞప్తిచేశారు. అధికారులు, సిబ్బందికి సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

షాద్‌నగర్ అసెంబ్లీ సమన్వయకర్తగా పసుల నరసింహయాదవ్ నియామకం

నరసింహాయాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కేశంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
బిజెపి తెలంగాణ ఎండోమెంట్ సెల్ (ధార్మిక)లో షాద్‌నగర్ అసెంబ్లీ సమన్వయకర్తగా కేశంపేట మండలపరిధిలోని కొత్తపేటగ్రామానికి చెందిన పసుల నరసింహాయాదవ్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా పసుల నరసింహాయాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, బిజెపి తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నవారుషల సూర్యప్రకాష్, కోకన్వీనర్ నిరంజన్‌దేశాయ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగిరాజ్ భూపాల్ గౌడ్, షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పసుల నరసింహ యాదవ్ బీజేపీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ (ధార్మిక) షాద్‌నగర్ అసెంబ్లీ సమన్వయకర్తగా, అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థి ఉద్యమాల నుండి రాజకీయాల్లోకి

-బిఆర్ఎస్‌లో చేరిన ఎబివిపి కీలకనేత సొప్పరి నరేందర్‌ముదిరాజ్

బిఆర్ఎస్ చేరుతున్న ఎబివిపి యువ నాయకుడు నరేందర్ ముదిరాజ్

కేశంపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:
విద్యార్థిదశ నుండి ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా పోరాడిన ఏబీవీపీ యువ నాయకుడు నరేందర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరటం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేశంపేట మండలంలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు సొప్పరి నరేందర్ ముదిరాజ్ బిఆర్ఎస్‌లో చేరారు. కేశంపేట మండల పరిధిలోని కొనయిపల్లి గ్రామ సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పార్టీ కండువా కప్పి సొప్పరి నరేందర్‌ను బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుకైనపాత్ర పోషిస్తూ ప్రజాసేవకు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ పార్టీ అభివృద్ధికై అహర్నిశలు కృషిచేసి పార్టీని బలోపేతం చేయడంలో ముందు ఉంటానని పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి లక్ష్యాలతో ప్రజలకు మరింత చేరువై పనిచేస్తానని సొప్పరి నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, సర్పంచులు వేణు గోపాలచారి, సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ, మాజీసర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్, నాయకులు శ్రీహరియాదవ్, సలీం, రంగు శ్రీకాంత్, అయిలాపురం సంతోష్‌రెడ్డి, కాకర్ల సునీల్, చిత్రమోని చెన్నయ్య, సోమరాజు మహేష్, రంగు రాకేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధం శరణం గచ్ఛామి..!

-ఎంపీడీవో బాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

బాల్‌రెడ్డి సంయుక్త దంపతులకు ప్రతిమను బహుకరిస్తున్న దృశ్యం

నందిగామ, ఆగస్టు 1, ప్రభాతవార్త:
నందిగామ మండల ఎంపీడీవోగా పి.బాల్‌రెడ్డి ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని బిఆర్ఎస్ సీనియర్ నేత బండోని గూడ సర్పంచ్ జట్ట కుమార్, బుగ్గొలిగూడ మాజీసర్పంచ్ బండి రాజులు అన్నారు. ఎంపీడీవో బాల్రెడ్డి పదవీవిరమణ సందర్భంగా వారు బుద్ధుని ప్రతిమను కానుకగా అందజేశారు. పదవి విరమణ పొందిన ఎంపీడీవో బాల్ రెడ్డి, ఆయన సతీమణి సంయుక్త దంపతులను పూలమాలవేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జట్ట కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవివిరమణ సర్వసాధారణమన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందించిన బాల్రెడ్డి ప్రజల మనస్సులను చూరగొన్నరని, బాల్రెడ్డి హయాంలో నందిగామ మండలం సర్వతో ముఖాభివృద్ధి దిశగా పయనించడానికి బీజాలునాటారని, ఆయన శేషజీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. సన్మానంలో రంగాపూర్ మాజీ సర్పంచ్ ఎనుగొండ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నర్కుడలో ఘనంగా వనమహోత్సవం

శంషాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:
శంషాబాద్ మండలం నర్కుడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసి, గ్రామ ప్రజలతో కలిసి మొక్కలునాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్ని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.